




క్రాస్ ఓటింగ్‌తో బెంబేలు

జహీరాబాద్‌లో ఉత్కంఠ

- పలుచోట్ల బీజేపీకి అనుకూలంగా బీఆర్‌ఎస్?
- అధినేతలూ పట్టించుకోలే..

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మే 14: పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ నియోజకవర్గంలో క్రాస్ ఓటింగ్ జరిగిందన్న సమాచారంతో బీఆర్‌ఎస్ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ నియోజకవర్గంలో అభ్యర్థి ఎంపిక మొదలు ఎన్నికలు ముగిసే వరకు బీఆర్‌ఎస్ వ్యవహరించిన తీరు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల షెడ్యూల్‌కు ముందే ఆ పార్టీ ఎంపీగా ఉన్న బీబీపాటిల్ బీజేపీలో చేరడం బీఆర్‌ఎస్‌ను అయోమయానికి గురిచేసింది. దీంతో ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు సరైన అభ్యర్థి కోసం పార్టీ నాయకత్వం అన్వేషణ సాగించింది. నియోజకవర్గంలో ఉన్న ముఖ్య నేతలు పోటీకి భయపడటంతో తప్పని పరిస్థితుల్లో నాయకత్వం నియోజకవర్గంతో సంబంధం లేని పార్టీ నాయకుడు గాలి అనిల్‌కుమార్‌ను ఎంపిక చేసింది. ఆర్థికంగా బలంగా ఉన్నారన్న కారణంతో ఈయన అభ్యర్థిత్వాన్ని నాయకత్వం ఖరారు చేసింది. అయితే మెదక్ పార్లమెంట్ నుంచి పోటీ చేయాలన్న ఆసక్తిని వ్యక్తం చేసిన అనిల్‌కుమార్‌కు జహీరాబాద్ పార్లమెంట్ టికెట్ ఇవ్వడంతో ఆయన నిరాశకు గురయ్యారు. పోటీకి విముఖత కనబరిచి అప్పట్లో మూడు నాలుగు రోజుల పాటు పార్టీకి దూరంగా ఉన్నారు. ఆ పార్టీ అగ్రనేత హరీశ్‌రావు కల్పించుకుని నచ్చజెప్పడంతో అనిల్‌కుమార్ పోటీకి సిద్ధమయ్యారు. అయినా నాయకత్వం ఆశించిన స్థాయిలో డబ్బు ఖర్చు పెట్టకపోవడంతో పార్టీ గెలుపుపై మొదటి నుంచి సందేహాలు వ్యక్తమయ్యాయి. ఇటీవల ఎన్నికల వరకు పోల్ మేనేజ్‌మెంట్ చేయడంలో పేరున్న పార్టీ నాయకత్వం ఈ ఎన్నికల్లో జహీరాబాద్ నియోజకవర్గంలో చేతులెత్తేసిందన్న ప్రచారం సాగింది. పోలింగ్‌కు రెండు రోజుల ముందు నుంచి నియోజకవర్గంలోని పలు సెగ్మెంట్లలోని పార్టీ కార్యకర్తలు బీజేపీకి సానుకూలంగా వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. ఈ ఆరోపణలు పోలింగ్ సరళిని పరిశీలించిన అసెంబ్లీ సెగ్మెంట్ల బీఆర్‌ఎస్ నాయకులను ఒకింత కలవరపాటుకు గురిచేశాయి. క్రాస్ ఓటింగ్ జరిగిన ఇలాంటి పరిస్థితుల్లో పెద్దగా క్యాడర్, లీడర్ బలంగా లేని బీజేపీ ఒక్కసారిగా కాంగ్రెస్‌తో నువ్వా-నేనా అన్న స్థాయికి రావడం భవిష్యత్‌లో ఎటువంటి పరిణామాలకు దారి తీస్తుందోనన్న ఆందోళన బీఆర్‌ఎస్ వర్గాల్లో వ్యక్తమవుతున్నది. ఏమైనా అసెంబ్లీ ఎన్నికల ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకోని బీఆర్‌ఎస్ నాయకత్వం ఈ నియోజకవర్గం అభ్యర్థి ఎంపిక నుంచి తడబడడం తమను అయోమయానికి గురిచేసిందని పార్టీ నాయకుడొకరు చెప్పారు. దీనికి తోడు ఉమ్మడి జిల్లా నేతగా ఉన్న మాజీ మంత్రి టి.హరీశ్‌రావు మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రాంరెడ్డిని గెలిపించుకోవడంపై కనబరిచిన శ్రద్ధ, ప్రచారం ఈ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌పై కనబర్చకపోవడం సైతం తమను రాజకీయంగా ఇబ్బందులకు గురిచేసిందని పార్టీ నాయకుడొకరు వాపోయారు.



క్ర.సం.	అసెంబ్లీ సెగ్మెంట్	మొత్తం ఓట్లు	పురుషులు	మహిళలు	ఇతరులు	పోలైన ఓట్లు	పురుషులు	మహిళలు	ఇతరులు	శాతం
మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో నమోదైన ఓట్లు										
1	నర్సాపూర్	2,27,088	1,16,898	1,10,184	6	1,91,315	95,185	9,128	2	84.25
2	సిద్దిపేట	2,37,591	1,16,436	1,21,084	71	1,74,969	87,030	87,912	27	73.64
3	మెదక్	2,18,735	1,03,918	1,14813	4	1,75,409	85,057	90,351	1	80.19
4	సంగారెడి	2,49,775	1,23,171	1,26,567	37	1,79,801	91,069	88,723	9	71.99
5	పటాన్‌చెరు	4,13,983	2,13017	2,00,880	86	2,60,841	1,35,848	1,24,969	24	63.01
6	దుబ్బాక	2,00,125	97,198	1,02,927	0	1,64,952	81,426	83,526	0	82.42
7	గజ్వేల్	2,80,913	1,38,186	1,42,722	5	2,25,607	1,13,239	1,12,366	2	75.09
మొత్తం		18,28,210	9,08,824	9,19,177	209	13,72,894	6,88,854	5,96,975	65	75.09

క్ర.సం.	అసెంబ్లీ సెగ్మెంట్	మొత్తం ఓట్లు	పురుషులు	మహిళలు	ఇతరులు	పోలైన ఓట్లు	పురుషులు	మహిళలు	ఇతరులు	శాతం
జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో నమోదైన ఓట్లు										
1	జుక్కల్	2,02,887	99,524	1,03,354	9	1,53,855	77,140	76,715	0	75.83
2	బాన్సువాడ	1,96,826	93,762	1,03,051	13	1,51,516	72,850	78,660	6	76.98
3	ఎల్లారెడ్డి	2,23,027	1,06,881	1,16,114	2	1,72,928	82,590	90,337	1	77.54
4	కామారెడి	2,55,007	1,22,474	1,32,514	19	1,82,325	86,121	96,198	6	71.50
5	నారాయణఖేడ్	2,37,241	1,18,859	1,18,373	9	1,72,508	88,921	83,584	3	72.71
6	అందోల్	2,50,860	1,22,668	1,28,187	5	1,91,320	96,859	94,461	0	76.27
7	జహీరాబాద్	2,75,562	1,37,694	1,37,866	2	2,00,597	1,03,616	96,981	0	72.80
మొత్తం		16,41,410	8,01,862	8,39,489	59	12,25,049	6,08,097	6,16,936	16	74.63



పటాన్‌చెరు గీతం యూనివర్సిటీలో స్ట్రాంగ్ రూమ్‌లకు సీల్ వేసిన సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి, ఎస్పీ రూపేష్

ఓటరు చైతన్యం

- జహీరాబాద్‌లో 74.63 శాతం, మెదక్‌లో 75.09 శాతం
- రెండు పార్లమెంట్లలో పెరిగిన పోలింగ్

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి/మెదక్, మే 14: పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ లోక్‌సభ నియోజక ఓటర్లు చైతన్యం చాటారు. కొన్ని గిరిజన తండాల్లో వందశాతం ఓటుహక్కు వినియోగించుకున్నారు. మెదక్ లోక్‌సభ స్థానంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో మొత్తంగా 75.09 శాతం పోలింగ్ జరిగింది. 2019 లోక్‌సభ ఎన్నికల కంటే 3.38 శాతం పోలింగ్ అధికంగా నమోదవడం విశేషం. మెదక్ లోక్‌సభ పరిధిలోని నర్సాపూర్ సెగ్మెంట్‌లో అత్యధికంగా 84.25 శాతం పోలింగ్ జరిగింది. పటాన్‌చెరులో 63.01 శాతంతో అతి తక్కువ పోలింగ్ నమోదైంది.

జహీరాబాద్‌లో..

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో 74.63 శాతం పోలింగ్ నమోదైంది. అధికంగా ఎల్లారెడ్డి అసెంబ్లీ సెగ్మెంట్‌లో 77.54 శాతం పోలింగ్ జరుగగా, తక్కువగా కామారెడ్డి అసెంబ్లీ సెగ్మెంట్‌లో 71.50 శాతం పోలింగ్ నమోదైంది. ఈ పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం 16,41,410 ఓట్లు ఉండగా 74.63 శాతం మేర 12,25,049 ఓట్లు పోలయ్యాయి. 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో పోలైన ఓట్ల కన్నా ఈసారి 4.93 శాతం పోలింగ్ పెరిగింది. గత ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలోని ఓట్లలో 69.70 శాతం మేర 10,44,504 ఓట్లు పోలయ్యాయి. అయితే ఈసారి ఓటు హక్కుపై కల్పించిన అవగాహన కార్యక్రమాల వల్ల 4.93 శాతం పెరిగి 74.63 శాతం మేర 12,25,049 ఓట్లు పోలయ్యాయి.


నర్సాపూర్ బీవీఆర్ఐటీ కళాశాలలో స్ట్రాంగ్ రూములకు సీల్ వేసిన మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ బాలస్వామి

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడెంచెల భద్రత

సంగారెడ్డి క్రైం/నర్సాపూర్/మెదక్ అర్బన్, మే 14: జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు చెందిన ఈవీఎంలను మంగళవారం రాత్రి 12 గంటల వరకు ప్రత్యేక వాహనాల్లో అధికారులు పటాన్‌చెరు మండలం రుద్రారం గీతం విశ్వవిద్యాలయానికి తరలించి స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. మెదక్ పార్లమెంట్ పరిధిలోని సిద్దిపేట, నర్సాపూర్, గజ్వేల్, మెదక్, దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీలో, సంగారెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను గిరిజన గురుకుల విద్యాలయంలోని స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. 20 రోజుల పాటు ఈవీఎంలు స్ట్రాంగ్ రూమ్‌లోనే ఉంటాయి. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 24 గంటల పాటు సీసీటీవీ పర్యవేక్షణలో నిఘా, మూడెంచల భద్రత కొనసాగుతుంది. గీతం యూనివర్సిటీని మంగళవారం సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి, ఎస్పీ చెన్నూరి రూపేష్ సందర్శించారు. నర్సాపూర్‌లోని స్ట్రాంగ్‌రూంలను మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ బాలస్వామి పరిశీలించారు. మెదక్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు బీవీఆర్ఐటీలోని స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు.

వక్ఫ్ భూమిలో అక్రమ నిర్మాణాలు


- రాత్రికి రాత్రే బోరు తవ్వకాలు
- నోటీసులతో సరిపెడుతున్న మున్సిపల్ అధికారులు

సంగారెడ్డిటౌన్, మే 14: జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో సర్కారు, వక్ఫ్ బోర్డు భూములకు రక్షణ లేకుండా పోయింది. వీటిలో పాగా వేస్తూ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అనుమతులు లేకుండానే విచ్చలవిడిగా ఆ భూముల్లో రాత్రికిరాత్రే బోర్లు వేస్తున్నారు. అక్రమ నిర్మాణాలను అరికట్టాల్సిన ఆయా శాఖల అధికారులు చోద్యం చూస్తున్నారు. సంగారెడ్డి పట్టణంలోని ఐబీ వెనుకాల జిల్లా అధికారులు నివాసం ఉంటున్న ఇళ్లకు కూతవేటు దూరంలో వక్ఫ్ బోర్డుకు చెందిన భూమి ఉన్నది. అందులో కొంతమంది రియల్టర్లు యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపట్టారు. మున్సిపల్ అధికారులు కేవలం నోటీసులతోనే సరిపెడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్మించిన టాస్క్‌ఫోర్స్ అధికారులు కూడా పట్టించుకోవడంలేదనే విమర్శలొస్తున్నాయి.

తప్పుడు పత్రాలు సృష్టించి

సంగారెడ్డి పట్టణంలోని ఐబీ వెనుక జిల్లా రెవెన్యూ అధికారి, ఆర్డీవోలు, జిల్లా అధికారులు నివాసం ఉంటున్న భవనాల సమీపంలో వక్ఫ్‌బోర్డ్‌కు చెందిన దాదాపు ఐదు ఎకరాల ఖాళీ స్థలం ఉన్నది. 374 సర్వేనంబరులో కొంత భూమిని గత కొన్ని సంవత్సరాల క్రితం ప్రభుత్వం వక్ఫ్‌బోర్డుకు కేటాయించినట్లు తెలిసింది. ఈ భూమిలో కొంతమంది వ్యక్తులు తప్పుడు పత్రాలు సృష్టించి అక్రమ నిర్మాణాలు చేపట్టారు. నెల రోజులుగా జిల్లా అధికార యంత్రాంగం అంతా లోక్‌సభ ఎన్నికల విధుల్లో బిజీగా ఉండడాన్ని గమనించిన కొందరు అక్రమార్కులు వక్ఫ్ బోర్డు భూమిపై కన్నేశారు. ఇదే అదనుగా భావించి అక్రమ నిర్మాణాలు చేపట్టారు.

నిర్మాణాలు తొలగించాలని నోటీసులిచ్చాం



సంగారెడ్డిలోని ఐబీ వెనుకాల ఉన్న వక్ఫ్ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలు తొలగించాలని నోటీసులు జారీ చేశాం. వాటిని కూల్చివేసేందుకు టాస్క్‌ఫోర్స్‌కు కూడా లేఖ రాశాం. అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేది లేదు. మున్సిపల్ ఆదాయానికి నష్టం చేకూరేలా అక్రమ నిర్మాణాలు చేపట్టడం సరికాదు. వాటిని ఎప్పటికైనా తొలగిస్తాం.

- కరుణాకర్, టౌన్ ప్లానింగ్ అధికారి, సంగారెడ్డి

అనుమతి లేకుండా బోరు

వక్ఫ్‌బోర్డు భూమిలో అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో పాటు రాత్రికి రాత్రే బోర్లు వేశారు. ఈ బోర్లకు వాల్టా చట్టం నిబంధనల ప్రకారం రెవెన్యూ, భూగర్భ జల శాఖల నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది. రాజకీయ పలుకుబడి కలిగిన కొంతమంది ఈ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండానే రాత్రి వేళల్లో బోర్లు వేశారు. ఈ విషయంపై స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదు.


సంగారెడ్డిలోని వక్ఫ్‌భూమిలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలు

పట్టించుకోని టాస్క్‌ఫోర్స్

అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలను అరికట్టేందుకు 2019లో రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, మున్సిపల్ శాఖల అధికారులతో టాస్క్‌ఫోర్స్ టీంను ప్రభుత్వం నియమించింది. సంగారెడ్డిలోని వక్ఫ్ బోర్డుకు కేటాయించిన 374 సర్వేనంబరులో భూమిలో అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని నెల రోజుల క్రితం మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. నిర్మాణాలు పూర్తయిన ఇళ్లను తక్షణమే తొలగించాలని టాస్క్‌ఫోర్స్ బృందానికి లేఖ రాసినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. సంగారెడ్డి పట్టణంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను నియంత్రించడంలో టాస్క్‌ఫోర్స్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. అక్రమ నిర్మాణాల్లో స్థానిక ప్రజాప్రతినిధుల హస్తం ఉండడంతోనే అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. వక్ఫ్‌బోర్డు భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వం మారి ఐదునెలలైనా

కేసీఆర్ బొమ్మతోనే కిట్ల పంపిణీ

తూప్రాన్, మే 14: ప్రసవ సమయంలో బాలింతలకు అందజేసే మాతాశిశు ఆరోగ్య కిట్‌ను ఇంకా కేసీఆర్ బొమ్మతోనే కొనసాగిస్తున్నారు. వాస్తవానికి బ్యాగ్‌లపై కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎంసీహెచ్ స్టిక్కర్లు వేసి పంపిణీ చేస్తున్నారు. కానీ తూప్రాన్‌లో మాత్రం ఇంకా కేసీఆర్ బొమ్మతోనే కిట్‌లు పంపిణీ చేస్తున్నారు. తూప్రాన్ పట్టణ పరిధి హైదర్‌గూడకు చెందిన మౌనికకు మూడు రోజుల క్రితం తూప్రాన్ పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవం జరిగింది. ప్రసవ అనంతరం ఆస్పత్రి అధికారులు కేసీఆర్ కిట్‌ను అందజేశారు. డిశ్చార్జీ సమయంలో అందజేయగా కేసీఆర్ కిట్‌ను వెంట తీసుకెళ్లారు. ప్రభుత్వం మారినప్పటికి ప్రసవ అనంతరం అందజేసిన కిట్‌పై కేసీఆర్ చిత్రం ఉండటం చూసి పలువురు అవాక్కయ్యారు.


తూప్రాన్ ఆస్పత్రిలో అందజేసిన కేసీఆర్ కిట్‌తో బాలింత

ఓటీపీ లేకుండానే డబ్బులు డ్రా

- లింక్ ఓపెన్ చేస్తే అంతే..
- రూ. 63 వేలు పోగొట్టుకున్న బాధితుడు

రేగోడు మే 14: వాట్సాప్ గ్రూప్‌లో వచ్చిన ఓ లింక్ ఓపెన్ చేసిన పాపానికి ఎలాంటి ఓటీపీ లేకుండానే అకౌంట్‌లో డబ్బులు మాయమవుతున్నాయి. ఆ లింక్ ఓపెన్ చేయగానే ఫోన్‌ను హ్యాక్ చేసి, అకౌంట్లు ఖాళీ చేస్తున్నారు. ఇలా రేగోడు మండలానికి చెందిన ఓ మాజీ సర్పంచ్ కుమారుడి ఖాతా నుంచి రూ. 63 వేలు డ్రా చేశారు. వివరాల్లోకి వెళ్లితే.. మండలంలోని కొన్ని వాట్సాప్ గ్రూపుల్లో గుర్తు తెలియని వ్యక్తులు లింకులు పంపిస్తూ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని మెసేజ్‌లు పెడుతున్నారు. యాప్ డౌన్‌లోడ్ చేసుకోగానే ఫోన్ హ్యాక్ చేసి డబ్బులు డ్రా చేస్తున్నారు. ఇలా రెండు మూడు రోజుల నుంచి మండలంలోని పలువురి అకౌంట్ల నుంచి డబ్బులు డ్రా అయినట్లు మెసెజీలు రావడంతో ఆందోళన చెందుతున్నారు. వాట్సాప్ గ్రూప్‌లలో సీఎస్సీ సర్వీస్ జయినింగ్ గ్రూప్ పేరుతో ఫైల్ డౌన్‌లోడ్ చేసుకున్న వ్యక్తుల ఫోన్‌లను హ్యాక్ చేసి డబ్బులు డ్రా చేస్తున్నట్లు సమాచారం. కొందరు వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. అయితే, ఈ విషయంలో తమకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని ఎస్ఐ రాజయ్య తెలిపారు. అపరిచిత వ్యక్తులు పంపించే మెసేజ్‌లకు స్పందించవద్దని, అలాంటి వారు సూచించే యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దని ఆయన కోరారు.



ఉపాధిహామీ

డబ్బులు ఇవ్వరా..?

- రెండునెలలుగా ఇవ్వలేదని ఆవేదన
- జహీరాబాద్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట పరికరాలతో ఉపాధిహామీ కూలీల ఆందోళన

7 లో

అమెరికాకు మంత్రి పొన్నం

- ఈ నెల 30 వరకు అక్కడే

హుస్నాబాద్, మే 14 : రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ఉదయం హైదరబాద్ నుంచి అమెరికాకు వెళ్లారు. ఆయన కుమారుడి ఉన్నత చదువుల నిమిత్తం వెళ్లినట్లు మంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి. అదే కాకుండా అమెరికాలోని తెలుగు అసోసియేషన్ సంఘాలు ఏర్పాటు చేసే పలు కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నెల 30న ఆయన తిరిగి హైదరాబాద్‌కు రానున్నారు.



మీర్‌ఖాన్‌పేట్‌లో అలరించిన కుస్తీ

కల్హేర్, మే 14: మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట్‌లో మంగళవారం నిర్వహించిన కుస్తీ పోటీలు అలరించాయి. గ్రామ దేవతలకు ప్రతిఏటా నిర్వహించే పండుగల సందర్భంగా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో ఈ ప్రాంతానికి చెందిన మల్లయోధులే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన పేరు మోసిన మల్లయోధులు కుస్తీ పోటీల్లో పాల్గొని ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. పోటీల్లో విజేతలైన మల్లయోధులకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు నీరుడి వేణు, ఆనందం, మాణిక్యం, సాయిలు, ప్రవీణ్, అన్నారావ్ తదితరులు పాల్గొన్నారు.



కల్హేర్ మండలంలోని మీర్‌ఖాన్‌పేట్‌లో నిర్వహించిన కుస్తీపోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

మందులు తీసుకొచ్చేందుకు వెళ్తూ..

- బైక్ పైనుంచి కల్వర్టు గోతిలో పడి వ్యక్తి మృతి
- రోడ్డు కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యమే మృతికి కారణం
- మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని రాస్తారోకో



కల్వర్టు గోతిలో పడి మృతిచెందిన యాకూబ్‌పాషా



ప్రమాద హెచ్చరిక సూచనలు లేకుండానే కొనసాగిస్తున్న కల్వర్టు పనులు

చేర్యాల, మే 14: అనారోగ్యం బారినపడిన తల్లికి మందులు తీసుకొచ్చేందుకు వెళ్తూ.. కుమారుడు చేర్యాల మండలం తాడూరు క్రాస్‌రోడ్డు సమీపంలో కల్వర్టు గోతిలో పడి మృతిచెందాడు. చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి చెందిన ఎండీ.యాకూబ్‌పాషా(29) లారీడ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తన తల్లి అనారోగ్యం బారినపడడంతో స్థానికంగా మందులు లభ్యం కాకపోవడంతో సోమవారం రాత్రి బైక్‌పై సిద్దిపేటకు బయలుదేరాడు. తాడూరు క్రాస్‌రోడ్డు సమీపంలో కల్వర్టు నిర్మిస్తున్న కాంట్రాక్టర్ సంబంధీకులు సంబంధిత ప్రదేశంలో ఎలాంటి హెచ్చరిక బోర్డులు, సూచనలు ఏర్పాటు చేయలేదు. చీకట్లో ఏమాత్రం కనిపించకపోవడంతో కల్వర్టు అంచునఉన్న ఇనుప చువ్వలు అడ్డు తలిగి యాకుబ్‌పాషా బైక్ పైనుంచి గోతిలో పడి అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న వారు పంచనామా నిర్వహించి.. మృతదేహాన్ని చేర్యాల మార్చురీకి తరలించారు. మృతుడి కుటుంబీకులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.



యాకూబ్‌పాషా(ఫైల్)

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని సీపీఐ రాస్తారోకో

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు అందె అశోక్, లారీడ్రైవర్లు తదితరులు చుంచనకోట క్రాస్‌రోడ్డు వద్ద జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారిపై కుటుంబసభ్యులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. యాకూబ్‌పాషా మృతితో అతడి కుటుంబం దిక్కులేకుండా పోయిందని, రోడ్డు కాంట్రాక్టర్, ప్రాజెక్ట్ మేనేజర్ బాధ్యత వహించాలన్నారు. మృతుడి కుటుంబానికి రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆందోళనతో వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులుపడ్డారు. పోలీసులు అక్కడికి చేరుకుని వారికి నచ్చజెప్పడంతో పాటు కాంట్రాక్టర్ సంబంధీకులు న్యాయం చేస్తామని హామీఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతుడికి ఇరువురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.



మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని చేర్యాలలో రాస్తారోకో చేస్తున్న సీపీఐ నాయకుడు అందె అశోక్, లారీ డ్రైవర్లు

రూ.36కోట్లతో జేఎన్టీయూలో ఐకానిక్ బిల్డింగ్..!

15న సీఎం చేతుల మీదుగా ప్రారంభం? : అనుమతి కోరుతూ ఎన్నికల సంఘానికి జేఎన్‌టీయూ లేఖలు

హైదరాబాద్ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీకి ఆర్ట్స్ కాలేజీ భవనం మాదిరిగా.. జేఎన్టీయూ హైదరాబాద్‌కు మరో ఐకానిక్ బిల్డింగ్ అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారు లు కసరత్తు చేస్తున్నారు. జేఎన్‌టీయూ ఏర్పడి 50ఏళ్లు(గోల్డెన్ జూబిలీ) పూర్తయిన సంద ర్భంగా యూనివర్సిటీలో మౌలిక సదుపా యాల అభివృద్ధి నిమిత్తం రూ.36 కోట్లతో చేపట్టిన ఐకానిక్ బిల్డింగ్ పనులు తుదిదశ కు చేరుకున్నాయి. ఈ భవనంలోని ఒక్కో అంతస్తులో 17వేల చదరపు అడుగుల చొప్పు న మొత్తం ఎనిమిది అంతస్తుల్లో కలిపి 1.36 లక్షల చదరపు అడుగుల స్పేస్ అందు బాటులోకి రానుంది. ఐకానిక్ భవనాన్ని తొలుత.. ఇంటర్ డిసిప్లినరీ అకడమిక్ రీసెర్చ్ అవసరాలకు వినియోగిం చాలని అధికారులు భావించారు. అయితే.. ఇందులోనే ఆదానీ కొనెక్స్ సంస్థ రూ.5 కోట్లతో అతిపెద్ద డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు జేఎన్‌టీయూతో ఒప్పందం చేసుకుంది. ఈ క్రమంలో డేటా సెంటర్ ఏర్పా టుకు ఒక అంతస్తును కేటాయించనున్నారు. అలాగే, భారతీ య అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) సౌజన్యంతో బీటెక్ స్పేస్ టెక్నాలజీ కోర్సును జేఎన్‌టీయూ నిర్వహించాలని భావిస్తోంది. ఈ మేరకు మరో అంతస్తును ఇస్రోకు కేటాయించాలని ఇటీవల జేఎన్‌టీయూ అధికారులు సూత్రప్రాయం గా అంగీకారానికి వచ్చారు. మిగిలిన ఆరు అంతస్తులను ఏవిధంగా వినియోగంలోకి తేవాలనే అంశంపై వర్సిటీ ఉన్నతా ధికారులు కసరత్తు చేస్తున్నారు.



అనుమతి కోసం ఎదురుచూపులు

రాష్ట్రంలో ఎన్నికల నియమావళి అమలులో ఉండడం, సోమవారం ఎన్నికలు ముగియ డం తో జేఎన్‌టీయూలో ఐకానిక్ బిల్డింగ్ ప్రారం భోత్సవానికి అనుమతులు కోరు తూ.. వర్సిటీ ఉన్నతాధికారులు ఎన్నికల సంఘానికి లేఖలు రాశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఈ భవనాన్ని ప్రారంభించాలని ఉన్నతాధికారులు భావిస్తుం డడంతో.. ఎన్నికల సంఘం నుంచి అనుమతి ఇస్తుందో, లేదోనని సందేహాలు వ్యక్తమవుతున్నా యి. ఎన్నికల సంఘం అనుమతిస్తే ఈ నెల 15న ఐకానిక్ బిల్డింగ్‌ను ప్రారంభించాలని నిర్ణయించారు. అలాగే, ఈ నెల 21న జేఎన్‌టీయూ వైస్‌చాన్స్‌లర్ కట్టా నర్సింహారెడ్డి పదవీకాలం ముగుస్తుండడంతో యూనివర్సిటీలోని కెమిస్ట్రీ విభాగంలో రూ.1.5 కోట్లతో ఏర్పాటు చేసిన యూరోపియన్ ల్యాబొరేటరీ, ఈఈఈ భవనంలో కొత్తగా రూ.50లక్షలతో నిర్మించిన సెమినార్ హాల్‌ను ప్రారంభిం చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కొత్త భవనాలు ప్రారంభోత్సవం జరిగితే యూనివర్సిటీ విద్యార్థులకు మరిన్ని మౌలిక వసతుల సమకూరుతాయని వర్సిటీ ఆచార్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో విద్యార్థిని ప్రతిభ

గజ్వేల్, మే 14: సీబీఎస్ఈ ఫలితాల్లో సెయింట్ మేరీస్ విద్యానికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థిని ప్రతిభ కనబరిచ్చారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని సెయింట్ మేరీస్ విద్యానికేతన్ సీబీఎస్ఈ పాఠశాలకు చెందిన విద్యార్థిని శయన ఇటీవల ప్రకటించిన సీబీఎస్ఈ ఫలితాల్లో 500 మార్కులకుగానూ 487 మార్కులు సాధించి సత్తాచాటారు. అదేవిధంగా పాఠశాలకు చెందిన నూర్, సహస్ర, వర్షిణి 466, శాస్త్రుల యశస్విని 459 మార్కులు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ గోపు ఇన్నారెడ్డి తెలిపారు. పదవ తరగతిలో 63 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 62 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని పల్లె శయనను కరస్పాండెంట్ ఇన్నారెడ్డి, ప్రిన్సిపల్ విజయపాల్‌రెడ్డి అభినందించారు.



ప్రతిభ కనబరిచిన ఆకుల సుశ్రుత్‌ను సన్మానిస్తున్న దృశ్యం

సీబీఎస్ఈలో ప్రతిభ కనబర్చిన విద్యార్థికి సన్మానం

గజ్వేల్‌టౌన్, మే 14: గజ్వేల్ పట్టణంలోని భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన ఆకుల సుశ్రుత్ సీబీఎస్ఈ ఫలితాల్లో 500ల మార్కులకుగానూ 491 మార్కులు సాధించి పాఠశాలలో ప్రథమస్థానంతో పాటు జాతీయస్థాయి ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా నవజీవన ఫౌండేషన్ ఆధ్వర్యంలో అతడికి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో డా.మంద సాయినాథ్‌రెడ్డి, డా.ఆకుల నరేశ్‌బాబు, వంగాల రంగాచారి, సరస్వతి, శిశు మందిర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరిణ పవన్, సావిత్రి, ప్రసన్నలక్ష్మి, బాసెట్టి విష్ణు, నరేందర్ పాల్గొన్నారు.

ప్రేమ విఫలమైందని యువకుడి ఆత్మహత్య

కొల్చారం, మే 14: ప్రేమ వివాహానికి అమ్మాయి కుటుంబీకులు నిరాకరించడంతో మనస్తాపానికి గురైన యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకోగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. కొల్చారం మండలం అప్పాజిపల్లి గ్రామానికి చెందిన సదాల శేఖులు, పోచమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చిన్న కుమారుడు సదాల ప్రవీణ్(26) ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నాడు. ఆరునెలలుగా మెదక్‌లో ప్రైవేటు ఉద్యోగిగా పనిచేస్తున్న అతడు ఒక అమ్మాయిని ప్రేమించాడు. ఈ విషయంలో అమ్మాయి వైపు బంధువులు ప్రవీణ్‌ను బెదిరించడంతో సోమవారం ఇంటి వద్దనే గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబీకులు అతడిని హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతిచెందాడు.



ప్రవీణ్(ఫైల్)

షార్ట్‌సర్క్యూట్‌తో కారులో మంటలు

జహీరాబాద్, మే 14: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి సమీపంలో రైల్వేగేటు వద్ద రోడ్డు మీదుగా వెళ్తున్న కారులో మంగళవారం ఒక్కసారిగా షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి ముందు భాగంలో మంటలు వచ్చాయి. అక్కడే రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు కొనసాగుతుండడంతో నీటి ట్యాంకర్‌తో స్థానికుల సహాయంతో మంటలను ఆర్పాడు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది.

ఉపాధిహామీ డబ్బులు ఇవ్వరా..?

● రెండునెలలుగా రాలేదని ఆవేదన
● ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఉపాధిహామీ కూలీల ఆందోళన


జహీరాబాద్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద పరికరాలతో ఆందోళన చేస్తున్న ఉపాధిహామీ కూలీలు

జహీరాబాద్, మే 14: పనిభారం తగ్గించాలని, పని ప్రదేశాల్లో వసతులు కల్పించాలని, సకాలంలో వేతనాలు ఇవ్వాలని డిమాండ్లతో పాటు, కేవైసీ పేరుతో ఇబ్బందులు పెడుతున్నారంటూ ఉపాధిహామీ కూలీలు ఆందోళన బాటపట్టారు. ఈ విషయమై మంగళవారం అల్గోల్ గ్రామానికి చెందిన సుమారు 200 మంది కూలీలు ఎంపీడీవో కార్యాలయం ఎదుట పరికరాలతో ఆందోళన చేపట్టారు. కార్యాలయానికి సెలవు కావడంతో వెనుదిరిగిపోయారు. బుధవారం మళ్లీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో పనిచేసే కూలీల డబ్బులు పెంచామని ప్రభుత్వాలు చెబుతున్నా.. పెంచిన డబ్బులు పక్కన పెడితే సకాలంలో కూలీ డబ్బులను ఇవ్వడంలో అధికారులు, పాలకులు విఫలమయ్యారని కూలీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనులైతే చేయండి, ఇదిగో వస్తున్నాయి.. అదిగో వస్తున్నాయంటూ అధికారులు కాలయాపన చేస్తూ.. తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జహీరాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతిరోజు 8వేల పైచిలుకు మంది కూలీలు ఉపాధిహామీ పనులు చేస్తున్నారు. ఆలస్యమైనా నేరుగా ఖాతాల్లోకి డబ్బులు వస్తాయనే ఆశతో పనులు చేస్తున్నామని పేర్కొంటున్నారు. గతేడాదికి సంబంధించిన కూలీల డబ్బులు ఇవ్వలేదని తెలిపారు. పని ప్రదేశాలకు వచ్చే అధికారులను ప్రతిరోజూ అడిగినా వివిధ కారణాలు చెబుతూ దాటవేసే ధోరణిని అవలంబిస్తున్నారని విచారం వ్యక్తం చేస్తున్నారు.

ఈకేవైసీ పేరుతో పొంతన లేని సమాధానాలు

తమ బ్యాంకు ఖాతాలను, పోస్టాఫీస్ ఖాతాలను ఈకేవైసీ చేయించుకుంటేనే పనిచేసిన డబ్బులు ఖాతాల్లోకి వస్తాయని, లేకుంటే రావని అధికారులు పొంతనలేని సమాధానాలు చెబుతుండడంతో కూలీలు వాపోతున్నారు. పనిచేసిన కూలీ డబ్బులకు ఈకేవైసీకి సంబంధమేంటని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పనులు చేసుకుని తర్వాత తాము ప్రతిరోజూ మీసేవ, బ్యాంకుల, కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇదిలా ఉండగా పని ప్రదేశాల్లో కూలీలకు మంచినీరు, నీడ సౌకర్యం, హెల్త్‌కిట్ తదితరాలను పెట్టడం లేదని వివరించారు. 1 ఫీటు లోతు, 2 మీటర్ల పొడవు, ఒకటిన్నర మీటరు వెడల్పుతో కాలువలు, తదితర పనులను చేస్తే రూ.300 ఇవ్వాల్సింది పోయి రూ.200-230 వరకు మాత్రమే ఇస్తున్నారని కూలీలు వివరించారు. అన్ని గ్రామాల్లో ఇదే తరహాలో డబ్బులు ఇస్తున్నారన్నారు. అలాగే పనిచేస్తున్న క్రమంలో తాము ఎండవేడిమితో అనారోగ్యాలకు గురైనా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

పని డబ్బులు సకాలంలో రావడం లేదు



చేసిన పనులకు సకాలంలో డబ్బులు రావడం లేదు. తనకు గతేడాదికి సంబంధించిన డబ్బులే కాకుండా.. ఈ ఏడాదికి సంబంధించిన ఆరువారాలకు రూ.14 వేల పైచిలుకు రావాల్సి ఉన్నది. అధికారులను అడుగుతూనే ఉన్నాం. వస్తాయంటున్నరు.. కానీ రావడం లేదు. ప్రతిరోజు బ్యాంకు, పోస్టాఫీసు చుట్టూ తిరుగాల్సి వస్తుంది. సకాలంలో డబ్బులు ఇచ్చి తమను ఆదుకోవాలి.

- ఏర్పుల పద్మమ్మ, అల్గోల్-జహీరాబాద్

ఈకేవైసీ పేరుతో ఇబ్బందులు పెడుతున్నరు



బ్యాంకు, పోస్టాఫీసుల్లో తెరిచిన ఖాతాలకు ఈకేవైసీ చేయిస్తేనే డబ్బులు ఖాతాల్లో పడుతాయని అధికారులు చెబుతున్నారు. దీంతో తాను ఈకేవైసీ కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా. ఆరు వారాలకు సంబంధించిన డబ్బులు సుమారు రూ.14వేల పైచిలుకు రావాల్సి ఉంది. పనిచేయాలా, లేక ఈకేవైసీ కోసం కార్యాలయాల వద్దకు వెళ్లాలా అంటూ ఆందోళన వ్యక్తం చేసింది.

శ్యామలమ్మ, అల్గోల్ -జహీరాబాద్

పని ప్రదేశంలో వసతులు కల్పించాలి



పని ప్రదేశంలో గతంలో నీడ, మంచినీరు, హెల్త్‌కిట్ తదితరాలను ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం వాటిని బంద్ చేశారు. ఎండల్లో పని చేస్తూ అనారోగ్యానికి గురైనా పట్టించుకోవడం లేదు. ఎండవేడిమి ప్రభావంతో పని ప్రదేశంలో ఇటీవల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రక్తంతో కూడిన వాంతులు, విరేచనాలు చేసుకున్నాడు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి.

- దండు మాణిక్, అల్గోల్-జహీరాబాద్


సంగారెడ్డిలోని జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి

మెదక్, జహీరాబాద్‌లో బీజేపీదే విజయం

● రాష్ట్రంలో బీజేపీకి డబుల్ డిజిట్ స్థానాలు
● బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి

సంగారెడ్డి అర్బన్, మే 14: మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ స్థానాల్లో బీజేపీదే విజయం ఖాయమని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సంగారెడ్డి చౌరస్తా సమీపంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈసారి దేశం, ధర్మం కోసం ఎన్నికలు జరిగాయన్నారు. రాష్ట్రంలో కూడా పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ డబుల్ డిజిట్ స్థానాలు కైవసం చేసుకుంటుందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు ఎన్ని ప్రలోభాలకు గురి చేసినా ఈసారి ప్రజలు మోదీని మూడోసారి ప్రధానమంత్రిని చేసేందుకు బీజేపీకి పట్టం కట్టారన్నారు. నారాయణఖేడ్‌లో పోలింగ్ రోజున కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేశ్‌కుమార్‌షెట్కార్ సోదరుడు బీజేపీ నాయకులపై దాడులు చేయడం దురదృష్టకరమన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్ గెలుపును చూసి జీర్ణించుకోలేక దాడులు చేయడం సరికాదన్నారు. ఈ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త బూత్ స్థాయి నుంచి కష్టపడి పనిచేశారని వారికి జిల్లా పార్టీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీజేపీ కీలకంగా ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, అనంత్‌రావు కులకర్ణి, జిల్లా అధికార ప్రతినిధి డా.రాజుగౌడ్, పట్టణ అధ్యక్షుడు రవి, కౌన్సిలర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మెదక్‌లో కాంగ్రెస్‌దే గెలుపు

● సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన నీలం మధు


సీఎం రేవంత్‌రెడ్డితో మధు

పటాన్‌చెరు, మే 14: మెదక్ లోక్‌సభను భారీ మెజార్టీతో కాంగ్రెస్ గెలుపొందబోతోందని సీఎం రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారని అభ్యర్థి నీలం మధుముదిరాజ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ ఇన్‌చార్జి దీపదాస్‌మున్షీలను మధుముదిరాజ్ కలుసుకుని పోలింగ్ సరళిని వివరించారు. స్వర్గీయ ఇందిరాగాంధీ మెదక్ నుంచి ప్రాతినిధ్యం వహించి దేశానికి ప్రధానిగా ఎన్నికయ్యారని, తిరిగి ఆ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకోబోతోందని సీఎం ధీమా వ్యక్తం చేశారని నీలం మధు పేర్కొన్నారు. భారీ మెజార్టీతో మెదక్ సీటును కైవసం చేసుకునేందుకు ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త కృషి చేశారని, మంత్రులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా భగీరథ జయంతి


నాగల్‌గిద్ద మండలం గుడూరులో భగీరథ జయంతి జరుపుకుంటున్న దృశ్యం

నాగల్‌గిద్ద, మే 14: మండల పరిధిలోని గూడురులో మంగళవారం శ్రీశ్రీ భగీరథ మహర్షి జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భగీరథ మహర్షి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సగర సంఘం రాష్ట్ర సలహాదారుడు శెట్టి వెంకట్‌సాగర్ మాట్లాడుతూ భగీరథుడు తపో బలంతో దివి నుంచి భువికి గంగను తెచ్చిన మహనీయుడని కొనియాడారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో యువజన మండలాధ్యక్షుడు రవీందర్‌సాగర్, సిద్ధన్న, హన్మంతు పాల్గొన్నారు.

రామాయంపేటలో...

రామాయంపేట, మే 14: భగీరథ మహర్షి జయంతి సందర్భంగా రామాయంపేటలోని చిత్తారమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి, అంబేడ్కర్, వివేకానంద విగ్రహాలకు పూలమాలలు వేసి.. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

ఖేడ్ ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలి

● యూటీఎఫ్ సిద్దిపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు


మాట్లాడుతున్న షేక్ వలిహమ్మద్, తప్పెట్ల యాదగిరి

సిద్దిపేట క్రైం/జగదేవ్‌పూర్, మే 14: ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు నిబంధనల ప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాలని అడిగినందుకు ఉపాధ్యాయులపై పోలీసులతో లాఠీచార్జి చేయించిన నారాయణఖేడ్ ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) డిమాండ్ చేసింది. మంగళవారం సాయంత్రం యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ వలిహమ్మద్, తప్పెట్ల యాదగిరి మాట్లాడుతూ నారాయణఖేడ్ ఆర్డీవోపై, పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఒకే రకమైన రెమ్యునేషన్ ఇవ్వాలని, పీవో, ఏపీవోలకు రోజుకు రూ.600, ఓపీవోలు రూ.400 ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో 691ను ఈ నెల 11న విడుదల చేసిందన్నారు. ఈ ఉత్తర్వుల ప్రకారమే మెదక్ నియోజకవర్గ పరిధిలోని మెదక్, నర్సాపూర్, సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాల్లో పీవో, ఏపీవోలకు రూ.3,150లు చెల్లించగా, నారాయణఖేడ్‌లో రూ.2,400 మాత్రమే ఇచ్చారని తెలిపారు. రాష్ట్రమంతటా ఒకే విధమైన రెమ్యూనరేషన్ చెల్లించాలని ఉత్తర్వులు ఉన్నప్పటికీ జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గంలో పోలింగ్ సిబ్బందికి రెమ్యూనరేషన్ చెల్లింపులో తేడా ఎందుకని ప్రశ్నించినందుకు సోమవారం రాత్రి నారాయణఖేడ్‌లో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి.లక్ష్మారెడ్డి, ఇతర ఉపాధ్యాయులపై ఆర్డీవో ఆదేశాల మేరకు పోలీసులు విచక్షణా రహితంగా లాఠీచార్జి చేసి గాయపరిచారన్నారు. నిబంధనలను పాటించకుండా, ప్రశ్నించిన ఉపాధ్యాయులపై దౌర్జన్యం చేసిన ఆర్డీవో, పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉత్తర్వుల ప్రకారమే సిద్దిపేట కలెక్టర్ పోలింగ్ సిబ్బందికి రెమ్యూనరేషన్ అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు నిబంధనల ప్రకారం రెమ్యునరేషన్ చెల్లించాలని అడిగినందుకు ఉపాధ్యాయులపై పోలీసులతో లాఠీచార్జి చేయించడాన్ని రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) తీవ్రంగా ఖండిస్తున్నదని, ఆర్డీవో, పోలీసులపై చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గజ్వేల్ వెంకట్ కిరణ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులపై దౌర్జన్యం చేసిన ఆర్డీవో, పోలీసులపై చర్యలు తీసుకోవాలని వెంకటకిరణ్‌తో పాటు యూటీఎఫ్ జగదేవ్‌పూర్ మండలాధ్యక్షుడు ఎం.శివుడు, ప్రధాన కార్యదర్శి పీ.రాజనర్సింహులు డిమాండ్ చేశారు.

లాఠీచార్జి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధులకు హాజరైన ఉపాధ్యాయులకు నిబంధనల ప్రకారం టీఏ, డీఏ చెల్లించాలని అడిగినందుకు పోలీసులతో లాఠీచార్జీ చేయించిన ఖేడ్ ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజారావు, శ్యాంసుందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


సంగారెడ్డిలోని వినాయక్‌సాగర్ చెరువులో బోటు చుట్టూ పేరుకుపోయిన గుర్రపు డెక్కలు

చెరువును కమ్మేసిన గుర్రపు డెక్క

● ఉపాధి కోల్పోతున్న మత్స్యకారులు, రజకులు ● తొలగించి ఆదుకోవాలని వేడుకోలు

సంగారెడ్డి రూరల్, మే 14: మత్స్యకారులు, రజకులకు ఆ చెరువే జీవనాధారం. అలాంటి చెరువు పూర్తిగా గుర్రపుడెక్కలతో నిండిపోయింది. దీంతో మత్స్యకారులు, రజకులకు ఉపాధి కరువై కుటుంబపోషణ భారమైపోయి పూటగడవని దీనస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని వినాయక్‌సాగర్ చెరువులో మత్స్యకారులు చేపలను పడుతూ జీవనం సాగిస్తుండగా.. రజకులు దుస్తులు ఉతుకుతూ (శుభ్రం చేస్తూ) ఉపాధి పొందుతున్నారు. అదేవిధంగా వేసవి విడిదిలో పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు చెరువులో చిన్నారులతో కలిసి తల్లిదండ్రులు షికారు చేసేలా మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి బోటును ఏర్పాటు చేశారు. బోటు నిర్వహణ చూసుకునే వారికి కూడా ఉపాధి కల్పించారు. కొంతకాలంగా చెరువులో గుర్రపుడెక్కలు పేరుకుపోవడంతో పలువురి ఉపాధికి గండిపడిందని చెప్పవచ్చు. గతంలో గుర్రపు డెక్కలను తొలగించాలని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డికి విన్నవించగా హైదరాబాద్ నుంచి మిషనరీని తెప్పించి తొలగించారు. కానీ కొంతకాలానికే తిరిగి గుర్రపు డెక్కలు మొలిచి చెరువు మొత్తం వ్యాపించాయి. దీంతో చెరువుపైనే ఆధారపడి జీవించే మత్స్యకారులు, రజకులు చేసేది లేక బట్టలు ఉతికేందుకు స్వయంగా చేతులతోనే గుర్రపు డెక్కలను తొలగిస్తున్నారు. బట్టలు ఉతికితేనే తమ పొట్ట నిండుతుందని తాము చేతులతో తీసివేసినా తిరిగి వస్తున్నాయని రజకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుర్రపు డెక్కల కింద చేపపిల్లలు ఊపిరాడక మృతిచెందుతున్నాయని మత్స్యకారులు తెలిపారు. ఇదిలా ఉండగా వేసవిలో సాయంత్రం సమయంలో పిల్లలతో కలిసి సరదాగా బోటులో విహరిద్దామని ఎంతో ఆశగా ఇక్కడికి వస్తే బోటు వెళ్లకుండా చెరువు మొత్తం గుర్రపు డెక్కతో నిండిపోయి ఉన్నది. దీంతో వారు చేసేదేమీ లేక నిరాశతో వెనుదిరుగుతున్నారు. అధికారులు స్పందించి చెరువులో గుర్రపు డెక్కను తొలగించాలని మత్స్యకారులు, రజకులు, స్థానికులు కోరుతున్నారు.


చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కలను తొలగిస్తున్న రజకుడు ముఖేష్

ప్రైవేట్ బస్సు, డీసీఎం ఢీ

● డ్రైవర్‌కు తీవ్రగాయాలు, ఆస్పత్రికి తరలింపు


రోడ్డు ప్రమాదంలో ఇరుక్కున్న రెండు వాహనాలు క్రేన్ సహాయంతో తొలగిస్తున్న దృశ్యం

చేగుంట, మే 14: ప్రైవేట్ బస్సు, డీసీఎం ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన చేగుంట మండలం చిన్నశివనూర్ గ్రామ శివారులో జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం చోటు చేసుకున్నది. ఎస్ఐ బాలరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపు డీసీఎం వెళ్తున్నది. హైదరాబాద్ నుంచి ప్రైవేట్ బస్సు నిజామాబాద్ వైపు వెళ్తున్నది. ఈ క్రమంలో డ్రైవర్ అజాగ్రత్త వల్ల బస్సు డివైడర్‌ను దాటుకుని డీసీఎంను ఢీకొన్నది. ఈ ఘటనలో మధ్యప్రదేశ్ రాష్ట్రం, గ్వాలియర్‌కు చెందిన రమేష్‌కుశ్వాహా(40)కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో డీసీఎం, ప్రైవేట్ బస్సు రెండు ఒకదానిలో ఒకటి ఇరుక్కోవడంతో.. రోడ్డుపై వెళ్లే వాహనదారులకు అంతరాయం ఏర్పడింది. ఎస్ఐ బాలరాజ్ క్రేన్ సహాయంతో రెండు వాహనాలను తొలగించారు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

నేటి నుంచి బ్రహ్మంగారి ఆరాధన ఉత్సవాలు

● 16న ఫలహార బండ్లు, 18న రథోత్సవం, కుస్తీపోటీలు


కొండాపూర్‌లో వార్షికోత్సవాలకు ముస్తాబైన లక్ష్మీనారాయణస్వామి గర్భగుడి

రేగోడు మే 14: రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందిన రేగోడు బ్రహ్మంగారి మఠంలో బుధవారం నుంచి ఆరాధన ఉత్సవాలను నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. 15న గోపాల కాలువలు, సాయంత్రం స్వామివారికి పల్లకి ఊరేగింపు. 16న శరబాక లింగమయ్య, అలెల్లి మోనప్ప ఆరాధన మహోత్సవం, ఉదయం మక్త వెంకటాపురం కళాకారులచే జడకొప్పు ప్రదర్శన, మధ్యాహ్నం 3 గంటలకు ఫలహార బండ్లు, సాయంత్రం అగ్నిగుండ ప్రవేశం, 17న శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారికి మహా నైవేద్యం, 18న ఉదయం 4 గంటలకు రథోత్సవం, మధ్యాహ్నం కుస్తీ పోటీలు, రాత్రి పోలేరమ్మకు బోనాలు నిర్వహిస్తున్నట్లు మఠం ప్రధాన అర్చకుడు శివకుమార్‌చారి తెలిపారు. ఆలయం అవరణలో ఈసారి అప్పసముద్రం చంద్రశేఖరచార్యులు ఆధ్వర్యంలో గణపతిపూజ, రుద్రహోమం, చండీహోమం, శ్రీచక్ర పూజ, వీరబ్రహ్మేంద్రస్వామి లక్ష మంత్ర హోమాలను ఈ నెల 17 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీపోతులూరి వీరబ్రహ్మంగారి జీవిత చరిత్ర నాటకాన్ని ఈ నెల 16, 18, 20, 22, 24వ తేదీల్లో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాల్లో తినుబండారాలతో పాటు వివిధ రకాల దుకాణాలువెలిశాయి.


రేగోడులోని బ్రహ్మంగారి మఠం

నేటి నుంచి లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు

కొండాపూర్, మే 14: మండల పరిధిలోని మారెపల్లిలోని లక్ష్మీనారాయణ స్వామి సప్తమ వార్షిక బ్రహోత్సవాలను ఐదురోజుల పాటు జరిపించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. వైకుంఠపురం ప్రధాన అర్చకుడు కందాడై వరదాచార్యుల పర్యవేక్షణలో ఉత్సవాలను జరుపుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం సంగారెడ్డి వైకుంఠపురం వేంకటేశ్వరాలయం నుంచి రథంపై ఉత్సవమూర్తుల శోభాయాత్ర, గురువారం పంచామృత కలశాలతో ఊరేగింపు, స్వామికి అభిషేకం, అంకురార్పణ కార్యక్రమాలు ఉంటాయి. శుక్రవారం యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ, పూర్ణాహుతి, తల్లిదండ్రులకు పాదపూజ ఉంటుంది. శనివారం స్వామివారి కల్యాణం, పల్లకీసేవ అనంతరం రథోత్సవం నిర్వహిస్తారు. చివరి రోజైన ఆదివారం చక్రస్నానం, పుష్పయాగం, దేవతోద్వాసన, ఉత్సవపరిసమాప్తితో బ్రహోత్సవాలు ముగుస్తాయి.

మహాయాగంలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

శివ్వంపేట, మే 14: మండల పరిధిలోని గోమారం గ్రామంలో లోక కళ్యాణార్థం పురోహితులు, శాస్త్రులు అయోధ్య రామశర్మ, శశిధరశర్మ ఆధ్వర్యంలో ఐదురోజుల పాటు చతుర్వేద పారాయణ పూర్వక చతుర్వేద మహాయాగం పూజలు ఘనంగా జరుగుతున్నాయి. రెండోరోజైన మంగళవారం మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నర్సింహారెడ్డి, నాయకులు మాధవరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.


శివ్వంపేట: మహాయాగం పూజల్లో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

చాకరిమెట్లలో కొబ్బరికాయ, పూజా సామగ్రి టెండర్

శివ్వంపేట, మే 14: మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన చిన్నగొట్టిముక్కల గ్రామంలోని చాకరిమెట్ల ఆలయంలో దేవాదాయశాఖ అధికారుల ఆదేశాల మేరకు 17న ఉదయం 11 గంటలకు కొబ్బరికాయ, పూజ సామగ్రి విక్రయ దుకాణం కోసం బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నామని ఈవో సారా శ్రీనివాస్, చైర్మన్ ఆంజనేయులుశర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలని తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి


మృతిచెందిన గేదె వద్ద రోదిస్తున్న సాయమ్మ

అల్లాదుర్గం, మే 14: విద్యుదాఘాతంతో పాడి గేదె మృతిచెందింది. అల్లాదుర్గం మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన గొల్ల సాయమ్మ వ్యవసాయ పొలం వద్దకు గేదెలను మేత కోసం తోలుకెళ్లింది. ఈ క్రమంలో విద్యుత్ స్తంభానికి అమర్చిన సర్వీస్ వైర్ గేదెకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. గేదె విలువ రూ.80 వేలు ఉంటుంది. బాధితురాలి విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసింది.

విద్యార్థులు లక్ష్యంతో ఎదగాలి



ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

మునిపల్లి, మే 14: విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని మాజీ ఎంపీపీ రాంరెడ్డి పేర్కొన్నారు. ఇటీవల పది పరీక్షాఫలితాల్లో మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన 8మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. వారికి దివంగత మాజీ ఎంపీటీసీ కనకయ్య కుమారుడు, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగి జి. పాండు ఆధ్వర్యంలో మంగళవారం సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం మాజీ ఎంపీపీ రాంరెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారుబడుల్లో చేర్పించేలా కృషి చేయాలని సూచించారు. అంతకు ముందు మాజీ ఎంపీటీసీ కనకయ్య జ్ఞాపకార్థంగా విద్యార్థులకు మెమొంటోలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంజిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకటలక్ష్మారెడ్డి, మాజీ జడ్పీటీసీ పెంటయ్య, ఓడీఎఫ్ పాండు, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం..

పడిగాపులు కాస్తున్న రైతులు

● ధాన్యం సేకరణను వేగవంతం చేయాలని డిమాండ్

మనోహరాబాద్, మే 14: మనోహరాబాద్ మండలంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణలో తీవ్ర జాప్యంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఐకేపీ, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మండలంలోని రంగాయపల్లి, ముప్పిరెడ్డిపల్లి, కూచారం, మనోహరాబాద్, కాళ్లకల్, లింగారెడ్డిపేట్, పర్కిబండ, పోతారం తదితర గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం, విక్రయాలు నత్తనడకన కొనసాగుతున్నాయి. చేతికి వచ్చిన పంటను అమ్ముకుందామంటే అధికారుల అలసత్వంతో తమకు తీవ్ర నష్టం జరుగుతున్నదని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా చోటు చేసుకుంటున్న వాతావరణ మార్పులు, రాత్రి వేళల్లో అకాల వర్షాలతో రోడ్లపై ఆరబోసిన ధాన్యం పూర్తిగా తడిసిపోతున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతర పనులన్నీ మానేసి రోజూ ధాన్యం రాశుల వద్దనే పడిగాపులు కాయాల్సివస్తుందని మండిపడుతున్నారు. జాప్యం కారణంగా ఎండిన ధాన్యం కూడా అకాల వర్షాలతో తిరిగి తడిసిపోవడంతో వాటిని ఆరబెట్టేందుకే వారాలు, నెలలు గడిచిపోతున్నాయని వాపోతున్నారు. అయినప్పటికీ కొనుగోలు కేంద్రాల్లో నత్తనడకన ధాన్యం సేకరిస్తూ తమ అవస్థలు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓవైపు ప్రజాప్రతినిధులు, మరోవైపు అధికారులు ఎన్నికలపై దృష్టి సారించడంతో తమను పట్టించుకునేదెవరని రైతులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణను వేగవంతం చేసేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



మనోహరాబాద్ మండలం దండుపల్లి వద్ద రోడ్డుపై ఆరబోసిన వరి ధాన్యం

17న 'గీతం'లో కేఎస్ పీపీ పట్టభద్రుల దినోత్సవం

● ముఖ్య అతిథిగా హాజరుకానున్న జస్టిస్ అరుణ్ కుమార్ మిశ్రా

పటాన్‌చెరు రూరల్, మే 14 : కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కేఎస్ పీపీ) పట్టభద్రుల దినోత్సవాన్ని శుక్రవారం గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ ప్రాంగణంలోని కిన్నెర సెమినార్‌హాల్లో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాతీయ మానవ హక్కుల కమిషన్ ఛైర్ పర్సన్ జస్టిస్ అరుణ్‌కుమార్ మిశ్రా హాజరు కానున్నారు. కార్యక్రమంలో పబ్లిక్ పాలసీ స్నాతకోత్తర (పీజీ) డిగ్రీని పూర్తిచేసిన దాదాపు 25 మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేయనున్నార

లోకసభ ఎన్నికల్లో సత్తా చాటనున్నాం: షబ్బీర్ అలీ



షబ్బీర్ అలీని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రామాయంపేట, మే 14: రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటనున్నామని, ప్రజలు కాంగ్రెస్ వైపే మొగ్గు చూపారని మాజీమంత్రి షబ్బీర్ అలీ పేర్కొన్నారు. రామాయంపేట శివారులోని తన ఫామ్‌హౌస్‌లో బస చేసిన సందర్భంగా మంగళవారం ఉదయం ఆయనను స్థానిక కాంగ్రెస్‌నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం షబ్బీర్‌అలీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకుందన్నారు. షబ్బీర్‌అలీని సన్మానించినవారిలో అక్షయ్, గొల్ల రమేష్, గణేష్‌తో పాటు సంఘ సేవకుడు ఎర్రం ఆంజనేయులు ఉన్నారు.

ఉపాధ్యాయులపై లాఠీచార్జి అమానుషం

బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వివిధ ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

నారాయణఖేడ్, మే 14: ఎన్నికల విధులలో పాల్గొన్న ఉపాధ్యాయులపై పోలీసులతో లాఠీచార్జి చేయించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు అశోక్, జిల్లా ఉపాధ్యక్షుడు కాశీనాథ్‌జాదవ్, జిల్లా కార్యదర్శి నరేష్, ఏశప్ప, డివిజన్ పరిధిలోని పలువురు నాయకులు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గుండులక్ష్మణ్ మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో కోరారు. ఎన్నికల కమిషన్ విడుదల చేసిన జీవో నెం.596 ప్రకారం ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు చెల్లించాల్సిన డబ్బులు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారుల తీరును ఉపాధ్యాయులు శాంతియుతంగా ప్రశ్నిస్తుంటే, నారాయణఖేడ్ ఎన్నికల అధికారి వారిపై లాఠీచార్జి చేయించారని తెలిపారు. ఉమ్మడిజిల్లాలోని ఇతర నియోజకవర్గాలలో పీవో, ఏపీవోలకు రూ.3,150 చెల్లించగా, నారాయణఖేడ్‌లో 2,550 మాత్రమే ఇచ్చారని, ఈ విధంగా చెల్లింపులో తేడాఎందుకని ప్రశ్నించిన ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయించడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి లాఠీచార్జి చేయించిన వారిపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

● **కల్హేర్:** నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఉపాధ్యాయులు తమకు రావాల్సిన భత్యం గురించి డిమాండ్ చేస్తే సోమవారం రాత్రి నారాయణఖేడ్‌లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద పోలీసులతో లాఠీచార్జి చేయించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని టీపీటీఎఫ్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నాగారం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ తమకు రావాల్సి అయిదు రోజుల భత్యం రాష్ట్రంలో ఏ విధంగా ఇస్తున్నారో ఇక్కడ కూడా అదేవిధంగా ఏకరీతిన ఇవ్వాలని అడిగినందుకు లాఠీచార్జి చేయడం దారుణమని మండిపడ్డారు. ఎన్నికల విధులు చేపట్టిన ఉపాధ్యాయులను శిక్షణ సమయంలో పొగిడిన అధికారులు పోలింగ్ ముగిశాక లాఠీచార్జి చేయించడం దారుణమన్నారు.

● **కంగ్టి:** ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయించిన ఆర్డీవో, పోలీసులపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ కంగ్టిమండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంజయ్య, స్వామి డిమాండ్ చేశారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం ఎన్నికల విధుల రెమ్యునరేషన్ చెల్లింపులోతేడా ఎందుకని ప్రశ్నించినందుకు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, ఇతర ఉపాధ్యాయులపై ఆర్డీవో ఆదేశాల మేరకు పోలీసులు విచక్షణారహితంగా లాఠీచార్జి చేసి గాయపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖేడ్ ఆర్డీవో, పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

● **మునిపల్లి:** నారాయణ ఖేడ్‌లో ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ సాబేర్ అలీ, శ్రీనివాస్ రాథోడ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులపై పోలీసులతో లాఠీచార్జి చేయించడం అమానుషమని, అందుకు కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఘనంగా ఎమ్మెల్యే పుట్టిరోజు



మనూరు: ఎమ్మెల్యే సంజీవరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

మనూరు, మే 14: నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పుట్టినరోజు వేడుకలు మనూరు మండలం బోరంచ నల్ల పోచమ్మ ఆలయం ఆవరణలో మంగళవారం కార్యకర్తలు, అభిమానుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డికి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డితో పాటు వివిధ నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున తరలి వచ్చి సంజీవరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నారాయణఖేడ్ మున్సిపల్ ఛైర్మన్‌ఆనంద్ స్వరూప్‌షెట్కార్, వైస్‌చైర్మన్ దారం శంకర్, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్, కౌన్సిలర్లు, జడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీపీలు, మాజీ పదాధికారులు పెద్ద ఎత్తునపాల్గొన్నారు. కాగా ఎమ్మెల్యే జన్మదినాన్నిపురస్కరించుకొని ఆయన కుటుంబ సభ్యులు పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సతీమణి అనుపమారెడ్డి, సోదరుడు చంద్రశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సంధ్యారెడ్డి, పంచగామ మాజీ సర్పంచు విఠల్‌రెడ్డి, అనురాగ్‌రెడ్డి, అన్వేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. పూజారులు వారికి ఆలయ మర్యాదలతో సన్మానించారు.

● **కల్హేర్:** మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో మంగళవారం కాంగ్రెస్ నాయకులు కేకు కట్ చేసి ఎమ్మెల్యే సంజీవరెడ్డి దినవేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మనీష్‌పాటిల్, సిర్గాపూర్ ఎంపీటీసీ పీరప్ప, కడ్పల్ పీఏసీఎస్ ఛైర్మన్ జలీల్, మాజీ సర్పంచులు జంగం స్వప్న శంకరయ్య స్వామి, వైజయంతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఖేడ్‌లో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



ఖేడ్ ఏరియా వైద్యశాలలో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, మే 14: నర్సుల సేవలు అమోఘమని స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్నిపురస్కరించుకొని మంగళవారం నారాయణఖేడ్ ఏరియావైద్యశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. నర్సులు అందించే సేవలు ఎంతో గొప్పవని, ఇదే స్ఫూర్తితో రోగులకు సేవలు అందించాలన్నారు. అనంతరం వైద్యసిబ్బంది ఎమ్మెల్యే సంజీవరెడ్డిచే కేక్ కట్ చేయించి, ఆయనకు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో వైద్యశాల సూపరింటెండెంట్ వెంకట లక్ష్మి, సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, పండరిరెడ్డి, శంకర్ ముదిరాజ్, వైద్యులు, నర్సులు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కొల్చారం, మే 14: మండలంలోని సంగాయిపేటలోని పోలంపల్లి పెంటయ్య ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం రంగంపేట జడ్పీహెచ్‌ఎస్ ఎస్సెస్సీ(2002 బ్యాచ్) పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. దాదాపు రెండు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ కాలం తర్వాత కలుసుకోవడంతో ఆత్మీయంగా పలకరించుకుంటూ పరస్పర యోగక్షేమాలను తెలుసుకున్నారు. చిన్ననాటి మధురస్మృతులను నెమరువేసుకుంటూ రోజంతా ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమానికి అప్పటి ఉపాధ్యాయులు ప్రభు, భగవాన్, రాజరాజేశ్వరి, వెంకట్రాములు, పీఈటీ సుధాకర్ హాజరు కాగా విద్యార్థులు వారిని సత్కరించారు. ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు తుక్కాపూర్ పశుపతి, చిన్నఘన్‌పూర్ శ్రీనివాస్‌గౌడ్, తాటి మల్లేశంతో పాటు 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలు ప్రారంభం

● ప్రిన్సిపాల్ బానోతు రాజన్న



ప్రిన్సిపాల్ బానోత్ రాజన్న

జగదేవ్‌పూర్, మే 14: మండల కేంద్రమైన జగదేవ్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియేట్ 2024-2025 విద్యా సంవత్సరానికిగానూ మొదటి సంవత్సరానికి అడ్మిషన్‌లు ప్రారంభ మయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ బానోతు రాజన్న ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉమ్మడి మెదక్ జిల్లాలోనే మొదటి ప్రభుత్వ జూనియర్ కళాశాలగా పేరుగాంచిన స్థానిక కళాశాల 50 సంవత్సరాలుగా ఎందరో విద్యార్థులను ఉన్నత శిఖరాలల్లో నిలిపిందని తెలిపారు. ఈ క్రమంలో ఈ కళాశాలలో విద్యాభ్యాసం చేసిన ఎంతో మంది విద్యార్థులు ప్రస్తుతం ఉన్నత ఉద్యోగాల్లో కొనసాగడమేకాకుండా వివిధ రంగాల్లో అభివృద్ధి సాధించి వెలుగొందుతున్నారని పేర్కొన్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి 30 తేదీ వరకు మొదటి దశ అడ్మిషన్‌లు కొనసాగుతాయని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ కోర్సులతో పాటు వృత్తి విద్యాకోర్సులలో ఇంగ్లీషు, తెలుగు మీడియంలో బోధనలు జరుగుతాయని ప్రిన్సిపాల్ రాజన్న వివరించారు.

బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ

గజ్వేల్, మే 14: గజ్వేల్ మండల పరిధిలోని జాలిగామ గ్రామానికి చెందిన కార్యకర్తల కుటుంబాలను గజ్వేల్ బీఆర్ఎస్ నాయకులు మాదాసు శ్రీనివాస్, జాలిగామ అశోక్‌రావులు పరామర్శించారు. జాలిగామకు చెందిన కోయడ నీరజ గుండెపోటుతో మృతిచెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతిని వ్యక్తం చేశారు. అదే గ్రామానికి చెందిన గౌటి బిక్షపతి ఇటీవల అనారోగ్యానికి గురికాగా వారి కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మాచాపురం స్వామి అనారోగ్యంతో బాధపడుతుండగా వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని భరోసాను ఇచ్చారు. వారితో నాయకులు రమేశ్‌గౌడ్, శివయ్య, బాల్‌నర్సయ్య, మురళీ ఉన్నారు.

● **దౌల్తాబాద్:** దౌల్తాబాద్ మండల పరిధిలోని దొమ్మాట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త నక్కసురేష్ తండ్రి నక్కరాములు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో మంగళవారం దివంగత మాజీ ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి తనయుడు, సోలిపేట సతీష్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా కార్యకర్యదర్శి ర్యాకం శ్రీరాములుతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

చిన్నకోడూరు, మే 14: దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందని బీజేపీ మండలాధ్యక్షుడు సూరగోని శేఖర్‌గౌడ్ అన్నారు. మంగళవారం చిన్నకోడూరులో సమావేశంలో బీజేవైఎం మండలాధ్యక్షుడు మాతంగి నాగరాజుతో కలిసి మాట్లాడుతూ.. రఘునందన్‌రావు గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీలో ప్రమాదకరంగా సెప్టిక్‌ట్యాంకు





అంగన్‌వాడీ కేంద్రంలో ముందుభాగంలోనే ఉన్న సెప్టిక్ ట్యాంకు మ్యాన్‌హోల్

నర్సాపూర్, మే 14: నర్సాపూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న సెప్టిక్ ట్యాంకు మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా తయారైంది. ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని అంగన్‌వాడీ టీచర్‌తో పాటు పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలోకి వెళ్లే చోట ముందు భాగంలో సెప్టిక్‌ట్యాంకు ఉండగా, దానిపై ఉన్న శ్లాబ్(మూత) పూర్తిగా దెబ్బతిన్నది. అంతేకాకుండా మ్యాన్‌హోల్ కూడా దెబ్బతిని పూర్తిగా తెరిచి ఉన్నది. దీంతో పిల్లలు లేదా ఇతరులు ఎవరైనా ఏమాత్రం అదమరిచినా ఉన్నా అందులో పడే ప్రమాదం ఉండటంతో తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. తాత్కాలికంగా కట్టెతో మూసివేసి జాగ్రత్తలు తీసుకుంటున్నా కాలు దానిపై పడితే మాత్రం సెప్టిక్‌ట్యాంకులో పడే ప్రమాదం ఉంది. పైగా సెప్టిక్ ట్యాంకు శ్లాబ్ ప్రమాదకరంగా మారిన విషయమై అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకులు పలుమార్లు సంబంధిత అధికారులకు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రమాదం జరగకముందే తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఖేడ్‌లో తగ్గిన పోలింగ్ శాతం

నారాయణఖేడ్, మే 14: నారాయణఖేడ్ పార్లమెంట్ ఎన్నికల్లో గత శాసన సభ ఎన్నికల కంటే పోలింగ్ శాతం భారీగా తగ్గింది. నియోజకవర్గంలో శాసన సభ ఎన్నికల కంటే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య 6,053 మంది పెరిగారు. అయినప్పటికీ పోలింగ్ శాతం తగ్గింది. శాసన సభ ఎన్నికల సమయంలో నియోజకవర్గంలో 2,31,188 మంది ఓటర్లు ఉండగా, మహిళలు 98,139 మంది, పురుషులు 93,037 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం ఓటర్లలో 1,92,480 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, ప్రస్తుతం ఓటర్ల సంఖ్య 2,37,241 మందికి చేరుకుంది. అయినప్పటికీ 1,72,508 మంది మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రస్తుతం మహిళలు 1,18,373 మంది, పురుషులు 1,18,859 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. శాసన సభ ఎన్నికల్లో 83.23 శాతం పోలింగ్ కాగా, ప్రస్తుతం 72.71 శాతం పోలింగ్ నమోదైంది. కాగా నియోజకవర్గంలో అత్యధికంగా నిజాంపేట మండలం కొత్తపల్లిలోని 118 పోలింగ్ బూత్‌లో 90.68శాతం నమోదు కాగా, అతి తక్కువగా నారాయణఖేడ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 175వ పోలింగ్ బూత్‌లో పోలింగ్ 50.21 శాతం మాత్రమే నమోదైంది.



తూప్రాన్ పోలింగ్‌బూత్‌లో బారులు తీరిన ఓటర్లు(ఫైల్)

తూప్రాన్ మండలంలో 76.17శాతం

తూప్రాన్, మే 14: తూప్రాన్ మండలంలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 76.17శాతం ఓటింగ్ నమోదైనట్లు తహసీల్దారు విజయలక్ష్మి తెలిపారు. తూప్రాన్ మండలంలో 34,090 మంది ఓటర్లు ఉండగా, 25,968 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు వివరించారు. వెంకటాయపల్లిలో అత్యధికంగా 91.48శాతం పోలింగ్ జరిగింది. మండలంలో 16,765 మంది పురుషులుండగా 13057మంది (77.88శాతం) ఓటు హక్కును వినియోగించుకున్నారు. 17,325 మంది మహిళా ఓటర్లు ఉండగా 12,911 మంది (74.52 శాతం) ఓటు వేశారని వివరించారు.

జిన్నారం మండలంలో 63.64శాతం

జిన్నారం, మే 14: జిన్నారం మండలంలో 63.64శాతం పోలింగ్ నమోదైంది. మండలంలో 60 పోలింగ్ స్టేషన్లకుగానూ 59,327మంది ఓటర్లు ఉండగా, 37,756 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో బొల్లారం మున్సిపాలిటీకి చెందిన 35,842 మంది ఓటర్లకుగానూ 18,842మంది ఓటింగ్‌లో పాల్గొనగా 52శాతం పోలింగ్ నమోదైంది. మున్సిపాలిటీ, 15గ్రామ పంచాయతీలలో కలిపి 63.64శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. కాగా ఆయా గ్రామాల్లో నమోదైన ఓట్ల శాతం ఆధారంగా ఆయా పార్టీల నాయకులు గెలుపు, ఓటములపై సమీక్షలు నిర్వహించుకుంటున్నారు.


చెట్ల గౌరారంలో అత్యధిక పోలింగ్

మనోహరాబాద్, మే 14: మండలంలో కేంద్రంలో సోమవారం 83 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మండలంలో గత ప్రభుత్వ హయాంలో వెంకటాపూర్ అగ్రహారం, చెట్లగౌరారం, దండుపల్లి, కొండాపూర్ నాలుగు గ్రామాలను నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. సోమవారం జరిగిన ఎంపీ ఎలక్షన్‌లో మండలంలో చెట్లగౌరారం గ్రామం అత్యధిక శాతంగా 90.56 శాతం ఓటింగ్ నమోదైంది. తక్కువగా కాళ్లకల్‌లో 75 శాతంగా ఓటు నమోదైంది.

దాడులకు పాల్పడితే సహించేది లేదు

● కాంగ్రెస్ నాయకులు

మద్దూరు, మే 14: గూండాయిజంతో దాడులకు పాల్పడుతూ రాజకీయం చేయాలని చూడడం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి తగదని, చేర్యాలలో పోలింగ్ కేంద్రాల వద్ద దాడులకు పాల్పడిన బీఆర్ఎస్ నాయకులకు గుణపాఠం తప్పదని కాంగ్రెస్ జిల్లా నాయకులు కామిడి జీవన్‌రెడ్డి, జక్కిరెడ్డి సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం మద్దూరు మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు మేక మల్లేశం అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు పార్టీ కండువాలతో పోలింగ్ కేంద్రాల వద్ద ప్రచారం నిర్వహిస్తున్న క్రమంలో, తమ రాష్ట్ర నాయకుడు కొమ్మూరి రాకేష్‌రెడ్డి ప్రశ్నించినందుకు దాడులకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. స్థానికేతరుడైన పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్థానికుల మధ్య విభేదాలు సృష్టించి భౌతిక దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు. అంతేకాకుండా ఎలక్షన్ కమిషన్ నిబంధనలను కూడా ఉల్లంఘించి నిరంకుశ పోకడలకు పోతున్న పల్లాతో పాటు అతని అనుచరవర్గంపై ఎలక్షన్ కమిషన్ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతమైతే ఇక ఊరుకునేది లేదని హెచ్చరించారు. వారివెంట మండల ప్రధాన కార్యదర్శి ఊట్ల శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ముస్త్యాల మనోహర్, నాయకులు ఇట్టబోయిన కనకచంద్రం, సోషల్‌మీడియా కన్వీనర్ ఎర్రబచ్చల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి వీరేందర్‌గౌడ్, బత్తిని కనకయ్య తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మెదక్ పార్లమెంట్‌లో గులాబీ జెండా ఎగడం ఖాయం

● సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డిలో మాట్లాడుతున్న చింతా ప్రభాకర్

సంగారెడ్డి టౌన్, మే 14: మెదక్ పార్లమెంట్ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగురవేయడం ఖాయమని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ధీమా వ్యక్తం చేశారు. సంగారెడ్డిలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అత్యధిక స్థానాలు వస్తాయన్నారు. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే బీఆర్ఎస్ పోలింగ్ శాతం పెరిగిందన్నారు. లక్ష మెజార్టీతో మెదక్ ఎంపీ వెంకట్రామారెడ్డి గెలుపొందడం ఖాయమన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతుగా పనిచేసిన పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.

బీవీఆర్‌ఐటీ ఆధ్వర్యంలో రెండురోజుల కంప్యూటర్ ఉచిత శిక్షణ

నర్సాపూర్, మే 14: నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కాలేజీలో రెండురోజుల పాటు విద్యార్థులకు, యువకులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 17, 18 తేదీల్లో రెండు రోజుల పాటు కంప్యూటర్ శిక్షణతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌పై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, యువకులు ఎవరైనా సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ముందుగా తమ పేరును 9491614352, 9703152000, 9948952051 నెంబర్లకు కాల్ చేసి నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని ఈ ప్రాంత విద్యార్థులు, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మల్లన్నను దర్శించుకున్న ఇండోర్ జిల్లా ఎస్పీ భగవత్‌సింగ్



మల్లన్న ఆలయ ఆవరణలో ఎస్పీ భగవత్‌సింగ్

చేర్యాల, మే 14: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయాన్ని మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్ జిల్లా ఎస్పీ భగవత్‌సింగ్ మంగళవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు స్వామివారి ప్రసాదం అందించి ఆశీర్వదించారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

రాయపోల్, మే 14: మండలంలోని అంకిరెడ్డిపల్లిలో మంగళవారం విద్యుదాఘాతానికి గురై ఓ ఎద్దు మృతి చెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు పలువునూరి భూపాల్‌రెడ్డి మంగళవారం తన ఎడ్లను మేత కోసం పొలం వద్దకు తీసుకెళ్లాడు. అనంతరం వాటిని అక్కడే కట్టేసి వచ్చాడు. కొంతసేపటికి ఓ ఎద్దు తాడును తెంచుకొని మేత మేసుకుంటూ వెళ్లి సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు రూ. 80వేల నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

పటిష్ఠ బందోబస్తు మధ్య ఈవీఎంలు: సిద్దిపేట సీపీ

సిద్దిపేట క్రైం, మే 14: పటిష్ఠమైన బందోబస్తు మధ్య సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, మూడు నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎం, వీవీ ప్యాట్స్ నర్సాపూర్ బీవీఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కాలేజీ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచి, ఎలక్షన్ నోడల్ అధికారులు, పోలీస్ నోడల్ అధికారుల సమక్షంలో సిల్‌చేసి చేశామని, వాటికి పటిష్ఠమైన ఆర్మ్డ్ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని సిద్దిపేట పోలీస్ కమిషనర్ బి.అనురాధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎం, వీవీ ప్యాట్స్‌ను కరీంనగర్ ఎస్‌ఆర్‌ఆర్ కాలేజ్ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచి, కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మృతి



సలీమోద్దీన్ (ఫైల్)

సిద్దిపేట అర్బన్, మే 14: సిద్దిపేట త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సయ్యద్ సలీమోద్దీన్ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఉన్న ఆయన సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి కుటుంబాన్ని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ ఫోన్‌లో పరామర్శించారు. డిపార్ట్‌మెంట్ తరఫున రావలసిన అన్ని బెనిఫిట్స్ త్వరలోనే అందిస్తామని కుటుంబ సభ్యులకు తెలిపారు. త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్, ఎస్‌ఐ విజయభాస్కర్, ఆర్‌ఎస్‌ఐ వెంకటరమణ, పోలీస్ సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియలకు ప్రభుత్వం తరఫున రూ. 20వేలను కుటుంబసభ్యులకు అందజేశారు.

టెండర్ ఇతరులకు ఇవ్వొద్దు

● రజక సహకార సంఘం నాయకుల విజ్ఞప్తి



రేణుకా ఎల్లమ్మ ఆలయ సిబ్బందికి వినతిపత్రం సమర్పిస్తున్న రజక సంఘం నాయకులు

హుస్నాబాద్, మే 14: హుస్నాబాద్ పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ ఆవరణలో ఇతరులకు ఇచ్చిన కోళ్లు, మేకలు కోసే టెండర్‌ను రద్దు చేయాలని పట్టణంలోని శ్రీవేంకటేశ్వర రజక సహకార సంఘం నాయకులు ఆలయ అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం ఆలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. పురాతన కాలం నుంచి రేణుకా ఎల్లమ్మ ఆలయ ఆవరణలో రజక సంఘ సభ్యులే కోళ్లు, మేకలు కోస్తూ ఉపాధి పొందుతున్నారని, ప్రస్తుతం తమను కాదని కొత్తగా టెండర్ పిలిచి ఇతరులకు కేటాయించారని తెలిపారు. ఈ కారణంగా ఉపాధి కోల్పోతున్నామని, వెంటనే ఆ టెండర్‌ను రద్దు చేసి రజకులకు కేటాయించాలని సంఘం నాయకులు పున్న సారయ్య వరుకోలు రాజు, పున్న బాలయ్య మైసయ్య, పున్న శ్రీను, పున్న రమేశ్ కోరారు.